
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 20 అక్టోబరు 2025
గరిష్ఠం 28.0
కనిష్ఠం 23.0



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	54,305	54,305
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.55 (4.34)	1,912.14	1,448.88
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.948 (44.1326)	35,723	29,723

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

నేడు దీపావళి



- లక్ష్మీ పూజ, రేపు నోములు
- అంతటా పండుగ సందడి

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెలుగు పూల పండుగ దీపావళి సందడి నెలకొన్నది. సోమవారం లక్ష్మీపూజ, మంగళవారం కేదారీశ్వరి నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. పలువురు ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలు, దుకాణాలను విద్యుత్ దీపాలు, బంతి పూలతో అలంకరించారు. రహదారుల వెంట బంతిపూలు, మట్టి ప్రమిదలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. పలు ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. పలువురు పట్టణాల నుంచి సొంత ఊర్లకు వెళ్తుండడంతో రహదారులపై ట్రాఫిక్ పెరిగింది. బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. జిల్లా అంతటా దీపావళి సందడి నెలకొంది. జిల్లా కేంద్రం భువనగిరిలోని రైతుబజార్, వినాయక చౌరస్తా, కుండల బజార్, తదితర ప్రాంతాల్లో బంతిపూలు, పూజాసామగ్రి విక్రయాల సందడి నెలకొంది. అలాగే జిల్లా అంతటా సదర్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ కల్చరల్: దీపావళి పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా పండుగ నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్కరి ఇంటిలో సిరి సంపదలు, సౌభాగ్యం వెల్లివిరియాలన్నారు.

రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



దీపావళి పండుగను రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా నిర్వహించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మనిషిలోని అజ్ఞానమనే చీకటిని తొలగిస్తూ, జ్ఞాన వెలుగును నింపేది దీపావళి పండుగని అన్నారు. అలాంటి పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని కాంక్షించారు.

పత్తి కొనుగోళ్లకు.. రంగం సిద్ధం



- 24న లాంఛనంగా తిప్పర్తి మండలంలో షురూ
- ఆపై మొత్తంగా 23 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు
- పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- 21లోగా 'కపాస్ కిసాన్' యాప్ పనులన్నీ కొలిక్కి

జిల్లాలో ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సన్నాహాలు పూర్తిచేసింది. ఈనెల 24న లాంఛనంగా తిప్పర్తి మండలంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించనుండగా, ఆ తరువాత వివిధ ప్రాంతాల్లోని 23 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు చేపట్టనున్నారు. సీసీఐ టెండర్ల ప్రక్రియ శుక్రవారం పూర్తికాగా, జిల్లాలో మొత్తం 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా, పత్తి కొనుగోళ్లకు 23 మిల్లులను ఎంపిక చేసింది.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

అధికార యంత్రాంగం 'కపాస్ కిసాన్' యాప్ సాఫ్ట్‌వేర్ పనులను ఈ నెల 21లోగా కొలిక్కి తెచ్చే పనిలో ఉంది. ఇక డేటా ఎంట్రీ ఆపరేటర్లను కలెక్టరేట్ నియమించనున్నారు. గతంలో జిన్నింగ్ మిల్లుల్లో ఆపరేటర్లతో సమస్యలు ఎదురుకాగా, ఈసారి కలెక్టర్ స్థాయిలో నియామకానికి ప్రభుత్వం ఆదేశించింది. అదేవిధంగా జిన్నింగ్ మిల్లుల వద్ద పైరవీలు, ఒత్తిళ్లకు తావులేకుండా స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. రైతులకు అందుబాటులో ఉన్న జిన్నింగ్ మిల్లులకు, లేదంటే వారికి వెసులుబాటు ఉన్న ప్రాంతంలో విక్రయించేలా స్లాట్ బుకింగ్ విధానంలో అవకాశం కల్పించారు.

23 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు

జిల్లాలో మార్కెటింగ్‌శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నారు. కొన్నేళ్లుగా ఈ విధానమే కొనసాగుతుండగా, ఈ ఏడాది సీసీఐ రంగంలోకి దిగడం ఆలస్యమైంది. ఎట్టకేలకు ఈనెల 24 నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. అయితే పత్తి రైతులకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8,110 దక్కితేనే ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటాక్‌కు రూ.1,410 తక్కువగా, రూ.6,700గా ఉంది. పత్తి కొనుగోళ్ల పారదర్శకంగా జరగాలంటే సీసీఐతో పాటు మార్కెటింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. తేమ, తూకం, ధర విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తేనే రైతులకు ప్రయోజనం. అందుకు మార్కెట్ కమిటీలు నిరంతరం పర్యవేక్షించేలా కొత్తగా కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా రైతులు ఫిర్యాదు చేసేందుకు త్వరలో ట్రోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా రోజువారీగా క్రయవిక్రయాలను డైరెక్టరేట్‌లో పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా, సీసీఐ ఆలస్యంగా రంగంలోకి దిగడంతో ఇప్పటికే దళారులు పత్తికి తక్కువ ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొన్ని చోట్ల పత్తి తడవడంతోపాటు రంగు మారుతోంది. ఈ నేపథ్యంలో నాణ్యతను సాకుగా చూపి ధర తగ్గిస్తారా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దేవరకొండ పరిధిలో ఐదు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. నల్లగొండ పరిధిలో రెండు, నకిరేకల్ పరిధిలో మూడు, చిట్యాలలో రెండు, చండూరు పరిధిలో నాలుగు, మాల్ వెంకటేశ్వర్‌నగర్ పరిధిలో ఏడు, శాలిగౌరారంలో ఒక జిన్నింగ్ మిల్లు ఉంది.

తెగుళ్లు, వర్షాలతో దిగుబడులపై ప్రభావం

ఈ ఏడాది జూన్, జూలైలో వర్షాలు లేకపోవడంతో ఆగస్టులో కురిసిన వర్షాలతో రైతులు జిల్లా వ్యాప్తంగా 5,68,778 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అయితే ఆలస్యంగా సాగు, దానికి తోడు సెప్టెంబరు మాసంలో ఆడపదడపా కురిసిన వర్షాలతో పత్తి చేలకు తెగుళ్ల సోకాయి. ఎలాంటి తెగుళ్ల లేకుండా ఉంటే ఎకరానికి 10 నుంచి 12క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. కానీ, ప్రస్తుతం జిల్లాలో చీడపీడల కారణంగా పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. కాయ పగిలే దశ లో వర్షాలు లేక పత్తి నాణ్యత దెబ్బతిన్నది. దీంతో జిల్లాలో 57,23,951 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసినా, అందులో కనీసం 50శాతం కూడా పత్తి దిగుబడి వచ్చే పరిస్థితులు లేవు. పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావో అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు కనీసంగా నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల పత్తి దిగుబడి కూడా వస్తుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాఫ్ట్‌వేర్ పనులు ప్రారంభించాం

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 24 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించనున్నాం. పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టడంతో పాటు రైతులకు మద్దతు ధర దక్కేందుకు కృషి చేస్తాం. జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశాం. ఈ మేరకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. అందుకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ పనులు జరుగుతున్నాయి. 24 నుంచి ఆయా మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లను చేపట్టనుంది. రైతులు సీసీఐకి పత్తి విక్రయించి మద్దతు ధరను పొందాలి. ప్రతీ రైతు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి.

- ఛాయదేవి, ఏడీఎం

23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

గడువు పెంచిన ప్రభుత్వం

27న లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

నల్లగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈనెల 23 వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 18వ తేదీన దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియగా, గతం కంటే ఈసారి దరఖాస్తులు తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో గతంలో 7వేలకు పైగా దరఖాస్తులు రాగా, ఈసారి 4,620 దరఖాస్తులు వచ్చాయి. దీంతో గడువును పెంచి దరఖాస్తుల సంఖ్య పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఈనెల 20న దీపావళి పండుగ సెలవు ఉండటంతో 21, 22, 23 తేదీల్లో దరఖాస్తులు తీసుకోనున్నారు.

23వ తేదీ రాత్రి 11.30గంటల వరకు దరఖాస్తులు తీసుకుంటారు. 23వ తేదీన జరగాల్సిన లాటరీ ప్రక్రియను ఈనెల 27న జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు. గతంలో దరఖాస్తులు ఫీజు రూ.2లక్షలు ఉండగా, దాన్ని ప్రభుత్వం రూ.3లక్షలకు పెంచింది. దీంతో దరఖాస్తుల సంఖ్య తగ్గినట్టుగా అధికారులు భావిస్తున్నారు. అయితే దరఖాస్తుల సంఖ్య తగ్గినా, ఫీజును రూ.3లక్షలకు పెంచడంతో గతం మాదిరిగానే ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది.

588.40 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయానికి ఎగువనుంచి 54,305 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 588.40 అడుగులుగా (307.2834టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,302 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8,718 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 34,185 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూరు లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో నకిరేకల్ ప్రధాన సెంటర్‌లో పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరోనా కష్టకాలంలో కూడా లయన్స్‌క్లబ్ సేవలందించడం గొప్ప విషయమన్నారు. లయన్స్ భవనం నిర్మించేందుకు పట్టణ శివారులో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా గవర్నర్ రేపాల మదన్‌మోహన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా లయన్స్‌క్లబ్ సేవలందిస్తోందన్నారు. నకిరేకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, డాక్టర్ వై.మోహన్‌రెడ్డి, కొండ సంతోష్, గుడుపూరి వెంకటేశ్వర్‌రావు, బుడిగె శ్రీనివాస్, ఎస్.రామ్మోహన్‌రావు, ఎర్ర శంభులింగారెడ్డి, శేఖర్ శెట్టి, డెంకల సత్యనారాయణ, ఉప్పల సంతోష్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ఎన్.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 400 మందికి అన్నదానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



కేజీబీవీలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి

మర్రిగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, నియోజకవర్గ రూపు రేఖలు మార్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో రూ.1.50కోట్లతో కల్పించిన మౌలి క వసతి సదుపాయాలను ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఫౌండేషన్ ఆధ్వర్యంలో కస్తూర్బాలో నూతన అదనపు తరగతులు తొమ్మి ది, 36 మూత్రశాలలు, మరుగుదొడ్లు, రెండు ఎకరాల్లో ఆటస్థలం అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం, తదితర పనులు చేపట్టామన్నారు.

పేదరికంతో బాధపడుతూ చదవలేని విద్యార్థులకు ఉన్నత విద్య, నిరుపేదలకు వైద్యం అందిస్తూ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా విడతల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి సుశీలమ్మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని పాఠశాల ఎస్‌వో జ్యోతికి సూచించారు. విద్యార్థినులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కాగా, పాఠశాలకు వచ్చిన కోమటిరెడ్డి దంపతులకు విద్యార్థినులు కోలాటంతో ఘన స్వాగతం పలికారు.

పదవులు కాదు.. ప్రజాసేవే ముఖ్యం

కొంత మంది తనను ఎంపీగా పోటీ చేయాలని ఒత్తిడి చేశారని, కానీ, సేవచేయాలంటే పదవులు అవసరం లేదని, సేవామార్గం, మంచి మనసు ఉంటే చాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నానని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మద్యం, డ్రగ్స్‌తో యువత పెడదోవపడుతున్నారని, వాటికి బానిసకాకుండా భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మేకల జగన్‌రెడ్డి, వెన్నమనేని రవీందర్‌రావు, శ్రీరామదాస్ శ్రీనివాస్, పాశం సురేందర్‌రెడ్డి, మాస నీలిమ చంద్రశేఖర్, బాలయ్య, మేతరి యాదయ్య, ఐతగోని వెంకన్న, పాక నగేష్, నక్క తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మి, ప్రసన్న, జంగయ్య, బిట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయపర హక్కుల కోసం పోరాడాలి

జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదుల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదుల్ రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు న్యాయపరంగా రావాల్సిన హక్కుల కోసం సమైక్యంగా పోరాడాలని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదుల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బోయవాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన ఎంఈవో, డిప్యూటీ డీఈవో, లెక్చరర్స్, డైట్ ప్రిన్సిపాల్స్ పదోన్నతుల కోసం న్యాయస్థానాల్లో పోరాటానికి కలిసి రావాలని కోరారు. పంచాయతీరాజ్ సంఘాలు ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని ఏళ్ల తరబడి ఉపాధ్యాయులను మభ్య పెడుతూ పబ్బం గడుపుతున్నాయన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పతేపురం సైదయ్య, గౌరవాధ్యక్షుడిగా బుచ్చిరాములు, కోశాధికారిగా ఆర్.వెంకట్రామణ, అసోసియేట్ అధ్యక్షుడిగా భద్రీనాథ్, ఉపాధ్యక్షులుగా కొంపల్లి లింగయ్య, జానయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, జిల్లా మాజీ అధ్యక్షుడు దూదిగామ స్వామి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా దీపావళి సందడి



నల్లగొండలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


సూర్యాపేటలో టపాకాయలు కొనుగోలు చేస్తున్న యువత


నలగొండ చర్లపల్లిలో...

చెడుపై మంచి సాధించే విజయాన్ని సూచించే దీపావళి పండుగకు జిల్లా ముస్తాబైంది. పూలు, ప్రమిదలు, టపాసుల కొనుగోలుతో మార్కెట్లు సందడిగా మారాయి. వరుస సెలవులతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట ఆలయం కిటకిటలాడింది. పండుగ నిర్వహణకు స్వస్థలాలకు చేరటంతో బంధుమిత్రుల పలకరింపులు, చిన్ననాటి స్నేహితుల ముచ్చట్లతో పల్లెలు కోలాహలంగా మారాయి.


యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల కోలాహలం






నల్లగొండలో


భువనగిరిలో గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న స్థానికులు


సూర్యాపేటలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


భువనగిరిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు

జాగ్రత్తలు వహిస్తే ఆనంద దీపావళి

పండుగ వేళ విషాదాలకు తావు ఇవ్వవద్దు

కాలుష్య రహితానికే ప్రాధాన్యం ఇవ్వాలి



సూర్యాపేటటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళిని ప్రతీఇంట్లో సంతోషాలతో నిర్వహిస్తారు. అయితే బాణాసంచా కాల్చేప్పుడు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా పండుగ నిర్వహించవచ్చు. టపాసులు కాల్చేప్పుడు కళ్లకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొంత మందికి దురదలు వస్తాయి. మరి కొందరికి కార్నియారాపిడి, రెటినల్ సమస్యలు ఏర్పడి, నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేగాక పొగ కారణంగా స్వరపేటిక వాయడం, గొంతు ఇన్‌ఫెక్షన్ తలెత్తే ప్రమాదం ఉంది. టపాసులు కాల్చేటప్పుడు కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరం. ఒక గజం దూరం నుంచి టపాసులు కాల్చడం ఉత్తమం. కనీసం 5 మీటర్ల నుంచి వీక్షించాలి. కాంటాక్ట్ లెన్స్ ఉంటే తీసేయాలి. టపాసులు కాల్చాక పరిశుభ్రమైన నీటితో చేతులు కడుక్కోవాలి.

కాల్చేటప్పుడు ఏం చేయాలి

బాణాసంచాల కొనుగోలుచేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలు టపాసులు కాల్చేప్పుడు పెద్దలు వారికి అతి సమీపంలో ఉండి తగిన జాగ్రత్తలు చెప్పాలి. డోర్ కర్టెన్లు, దుస్తులు ఉన్న చోట దూరంగా కొవ్వొత్తులు వెలిగించాలి. ప్రాథమిక చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. చాలా మంది యువకులు బాణాసంచాలను, చిచ్చుబుడ్లు, భూచక్రాలను చేతిలోనే కాల్చాలని అనుకుంటారు.

అలాంటి సాహసాలకు పూనుకుంటే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే. కాల్చి న టపాసులను నలిపివేయడం, వాటిపై నీరు పోయడం, మట్టిని చల్లడం చేయాలి. సగం కాలిన టపాసులను వదిలేయకుండా నీళ్ల బకెట్లలో వేస్తే మంచిది. సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టాలనే ఉత్సాహంతో టపాసులు కాలుస్తూ సెల్ఫీలకు ప్రయత్నించకూడదు. టపాసులు కాల్చేటప్పుడు సింథటిక్ దుస్తులు ధరించకూడదు.

త్యాగధనుల స్మృతిలో..

- విధి నిర్వహణలో అసువులు బాసిన రక్షక భటులు
- నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- గుట్ట పోలీస్‌స్టేషన్ పేల్చి 28 ఏళ్లు

అంకితభావంతో పనిచేయడమే వారి లక్ష్యం. విధి నిర్వహణలో ప్రాణాల్ని సైతం లెక్కచేయకపోవడం వారి నైజం. సమాజ రక్షణకు అహర్నిషలు కృషి చేస్తూ.., రాత్రనక, పగలనక అసాంఘిక శక్తులతో పోరాడుతున్న పోలీసుల త్యాగం వెలకట్టలేనిది.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)


వంగపల్లిలో అనాథ వృద్ధురాలికి ఆహార పదార్థాల కిట్టును అందజేస్తున్న ఏసీపీ, సీఐ (ఫైల్)

ఆపదైనా, అత్యవసరమైనా క్షణకాలంలో ఎదుట నిలిచి ఆపన్నహస్తం అదించే గురుతర బాధ్యతను పోలీసులు నిర్వహిస్తున్నారు. హింసను అరికట్టడం, నేరాలను తగ్గించడం, మత్తు పదార్థాల వంటి సమస్యలను నివారించడంలో పోలీసులు పోరాటం చేస్తూనే ఉంటారు. ఈ అసాంఘిక శక్తులపై పోరాటంలో ప్రాణాలను కోల్పోయిన పోలీసులు ఎందరో. తమ కుటుంబాలను సైతం వదిలి సమాజ రక్షణ కోసం నిరంతరం పాటుపడే పోలీసుల త్యాగాలను స్మరించుకొనే రోజే అక్టోబరు 21. పోలీసుల అమరుల త్యాగాల గుర్తుచేసుకొనే ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఉంది.

సామాజిక సేవలోనూ పోలీసుల పాత్ర

ఓ వైపు శాంతి భద్రతలను పరిరక్షిస్తూ పట్టణంలో అనాథలై వీధుల్లో భిక్షాటన చేస్తున్న వృద్ధులకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు మరోవైపు యాదగిరిగుట్ట సబ్‌డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో స్థానిక సీఐ బొడ్డుపల్లి భాస్కర్, పోలీస్ సిబ్బంది గుట్టలో వృద్ధులకు ఆర్థిక సహకారం, దుస్తులు, ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. అనాథలుగా వదిలివేసిన వృద్ధులను వారి కన్నబిడ్డలు, కుటుంబ సభ్యులను పిలిపించి వారి వద్దకు చేర్పి పోషించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. యువత డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల బారీన పడి జీవితాలు నాశనం చేసుకోకుండా, వారి కుటుంబాలు ఇబ్బందులకు గురికాకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగహన సదస్సులు నిర్వహిస్తూ సమాజ రక్షణలో పోలీసులు కీలక భూమిక పోషిస్తున్నారు.

సమాజంలో పోలీసులు వ్యవస్థ లేకుంటే మనుగడ సాధించలేం..



సమాజంలో పోలీసు వ్యవస్థలేకుంటే మనుగడ సాధించలేం. గొడవలు, అల్లర్లు, కుటుంబ సమస్యలు, హత్యలు, రౌడీలను నివారంచడం , ఎన్నికల్లో ప్రతి విషయంలో పోలీసుల పాత్ర కీలకం. ప్రజలు శాంతియుతంగా కంటి నిండ నిద్రపోతున్నారంటే అందుకు పోలీసుల సేవలు అందుకు నిదర్శనం.

- భీమగాని నర్సింహగౌడ్, పెద్దకందుకూర్

అమరుల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం



పోలీస్ అమరుల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం. వారి త్యాగాల ను భావితరాలకు అందించడానికే పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నాం. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీస్‌లు కీలకపాత్ర పోషిస్తున్నారు. కేవలం విధులు నిర్వహించడమే కాకుండా గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై యువతకు అవగహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

- శ్రీనివాస్‌నాయుడు, యాదగిరిగుట్ట ఏసీపీ

యాదగిరిగుట్ట పోలీస్ అమరుల యాదిలో..

యాదగిరిగుట్ట పట్టణంలో 1998 జనవరి 17న నక్సలైట్లు పోలీస్‌స్టేషన్‌ను పేల్చివేసిన ఘటన జరిగి 28 ఏళ్లయింది. అప్పట్లో విధినిర్వహణలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు, మిర్యాలగూడకు చెందిన వారి మిత్రుడు మృతిచెంది 28 ఏళ్ల పూర్తయింది. నాటి చేదు అనుభవాలు నేటికీ పోలీసులు మరువలేకపోతున్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ సంవత్సరం వారి యాదిలో నివాళి అర్పిస్తూ, వారిని స్మరించుకుంటున్నారు.

పైసల్లేక ఏడాదిన్నరాయే!



- ఉపాధి కార్యాలయాల నిర్వహణ ఎలా?
- ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు
- నెలనెలా ఖర్చులు భరించలేక సతమతమవుతున్న ఏపీవోలు
- వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

మోత్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి చూపుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి నిర్వహణ ఖర్చులు అందడం లేదు. దీంతో ఏపీవో (అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్)లు నానా తంటాలు పడుతున్నారు. ప్రతీ నాలుగు నెలలకోసారి అందాల్సిన నిర్వహణ ఖర్చులు ఏడాదిన్నర (నాలుగు విడతలు)గా అందకపోవడంతో పలువురు ఏపీవోలు అప్పులు చేసి కార్యాలయాలను నడుపుతున్నారు. వచ్చే వేతనమే నెలనెల సకాలంలో అందక, చాలీచాలని వేతనంతో ఇంటి ఖర్చులకే ఇబ్బందిపడుతున్న ఏపీవోలకు కార్యాలయాల నిర్వహణ అదనపు భారమైంది.

తప్పని నిర్వహణ ఖర్చులు..

ఉపాధి కార్యాలయాల్లో ప్రతీ రోజు స్టేషనరీ అవసరముంటుంది. నెలనెలా కరెంటు బిల్లు, ఇంటర్‌నెట్ బిల్లు చెల్లించాలి. సమావేశాలు నిర్వహించినప్పుడు చాయ్, బిస్కట్లు, కంప్యూటర్, ప్రింటర్ రిపేర్‌కొస్తే బాగు చేయించడం తప్పదు. ఒక్కో కార్యాలయానికి మండలంలోని గ్రామాలు, కూలీలను బట్టి రూ.3వేలనుంచి రూ.3,500 వరకు స్టేషనరీ, నెలకు సుమారు రూ.1500 వరకు కరెంటు బిల్లు, సుమారు రూ.వెయ్యి వరకు ఇంటర్‌నెట్ బిల్లు చెల్లించడంతో పాటు ఇతర ఖర్చులు భరించాల్సిందే.

నాలుగు కేటగిరీలుగా నిర్వహణ ఖర్చుల కేటాయింపు..

కేంద్ర ప్రభుత్వం కూలీల పని దినాల ఆధారంగా కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులు కేటాయిస్తుంది. రాష్ట్రంలోని ఉపాధి హామీ కార్యాలయాలను నాలుగు కేటగిరీలుగా విభజించి నిర్వహణ ఖర్చులు నిర్ణయించింది. నిర్వహణ ఖర్చులు ఏడాదికి మూడు విడతలుగా ప్రతీ నాలుగు నెలలకోసారి చెల్లించాలి. లక్ష కన్నా తక్కువ పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.60 వేలు, వీటిని మొదటి విడత రూ.30వేలు, మిగతా రెండు విడతలు రూ.15వేల చొప్పున చెల్లిస్తారు. లక్ష నుంచి రెండులక్షల పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.75వేలు, వీటిని మొదటి విడత 37,500, మిగతా రెండు విడతలు రూ.18,750 చొప్పున, రెండు లక్షల నుంచి మూడు లక్షల పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.85వేలు, వీటిని మొదటి విడత రూ.42,500, మిగతా రెండు విడతలు రూ.21,250 చొప్పున, మూడు లక్షల కన్నా ఎక్కువ పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.లక్ష, వీటిని మొదటి విడత రూ.50వేలు, మిగతా రెండు విడతలు రూ.25వేల చొప్పున చెల్లిస్తారు.

ఏపీవోలకు వచ్చే వేతనమే తక్కువ

ఉపాధి హామీ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఏపీవోలు రెగ్యులర్ కాలేదు. వారు ఎఫ్‌టీఈలు (ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్)గా కొనసాగుతున్నారు. వారికి వారి సీనియార్టీని బట్టి నెలకు రూ.44వేల నుంచి రూ.56వేల వేతనం అందుతుంది. వారికి మూడేళ్లుగా టీఏ, డీఏ సౌకర్యం రద్దుచేశారు. వారు ఫీల్డ్‌కు వెళ్లినా, సమావేశాలకు ప్రధాన కార్యాలయానికి వెళ్లినా సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే.

వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలు, ఏపీవోలు, టీఏలకు ఒక నెల, అటెండర్‌కు 5నెలలు, ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లకు 2నెలల వేతనాలు రావాల్సి ఉంది. బతుకమ్మ, దసరా పండుగలను సైతం అప్పుచేసి జరుపుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీవోలు, ఉపాధి సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిన పనిదినాలు

కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల పనిదినాలు ఏడాదికింత తగ్గిస్తోంది. కరోనా కాలంలో 2021-22లో రాష్ట్రంలో 14.25 కోట్ల పనిదినాలు ఉండగా, 2022-23లో 11 కోట్లకు, 2023-24లో 10.50 కోట్లకు తగ్గించింది. 2024-25లో 12కోట్లకు పెంచిన పని దినాలను 2025-26లో 6.50 కోట్లకు తగ్గించింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు...

యదాద్రి భువనగిరి జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 23, నల్లగొండ జిల్లాలో 33 ఉపాధి హామీ కార్యాలయాల చొప్పున ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలున్నాయి. రాష్ట్రంలో లక్ష కన్న తక్కువ పని దినాలు ఉన్న కార్యాలయాలు 43, రెండు లక్షలలోపు పనిదినాలు ఉన్న కార్యాలయాలు 191, మూడు లక్షలలోపు పని దినాలు ఉన్న కార్యాలయాలు 185, మూడు లక్షలకు పైన పనిదినాలు ఉన్న కార్యాలయాలు 120 ఉన్నాయి. ఈ ఉపాధి హామీ కార్యాలయాలకు 2024-25 ఏడాదికి మూడు విడతలు, 2025-26 సంవత్సరంలో మొదటి విడత కలిపి మొత్తం రూ.6,69,4500 నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంది.

పండుగకు వచ్చి పరలోకానికి...

• వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పీఏపల్లి, కేతేపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున దుర్మరణం చెందారు.


అర్జున్ రాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పండుగకు వచ్చిన యువకుడు పరలోకానికి వెళ్లాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని బీటెక్ విద్యా ర్థి మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని ఘనపురం స్టేజీ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, స్థా నికుల తెలిపిన వివరాల ప్రకారం... గుడిపల్లి మండలం కోదండపురం గ్రా మానికి చెందిన మైనం అర్జున్ రాంప్రసాద్ (23) హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి కోచింగ్ తీసుకుంటున్నాడు. దీపావళి పండుగ కు స్వగ్రామం గుడిపల్లి మండలం కోదండపురం గ్రామానికి వస్తున్నాడు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని ఘనపురం శివారులో గుర్తు తెలియని వాహనం అర్జున్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అర్జున్ రాంప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కోదండపురం గ్రామంలో విషాదఛాయ లు అలుముకున్నాయి. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గుడిపల్లి పోలీసులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ...


మేకల వెంకట్‌రెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శివారు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి గ్రామస్థులు తెలిసిన వివరాల మేరకు... చెర్వుగట్టుకు చెందిన మేకల వెంకట్‌రెడ్డి (58) తన వ్యవసాయ బావి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నాడు. అదే దారిలో నార్కట్‌పల్లి వైపునకు వస్తున్న దిచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన మేకల వెంకట్‌రెడ్డిని హుటాహుటిన నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు వెంకట్‌రెడ్డి గతంలో చెర్వుగట్టు దేవస్థానం ధర్మకర్తగా పనిచేశారు. వెంకట్‌రెడ్డి అకాల మృతి పట్ల పలువురు నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేకల అరుణరాజిరెడ్డి, మల్ల బాలకృ ష్ణ, రేగట్టె నర్సిరెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, నేతకాని కృష్ణయ్య, వారాల రమేష్, పున్నంరాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మల్ల శంకర్ తదితరులు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరు...

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై గల వైజంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇనుపాముల గ్రామానికి చెందిన పాశం రాంరెడ్డి (48) నకిరేకల్ వైపు నుంచి ఇనుపాముల వైపున హైవే వెంట ఉన్న తన ఇంటికి వెళ్లేందుకు వై జంక్షన్‌లో కాలినడకన రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న టవేరా వాహనం రాంరెడ్డిని ఢీకొట్టింది. దీంతో రాంరెడ్డి తలకు బలమైన గాయాలతో పాటు ఒక చేయి, ఒక కాలు విరిగాయి. తీవ్రంగా గాయపడిన రాంరెడ్డిని బంధువులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ వివరించారు.

దుబాయ్‌కి వెళ్తున్నానంటూ బలవన్మరణం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'దుబాయ్‌కు వెళ్తున్నాను. మూడు నెలల వరకు తిరిగి రాను' అంటూ ఇంట్లో చెప్పిన ఓ యువకుడు నగర శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తూ నగరంలోని రాయదుర్గం షేక్‌పేటలో నివాసం ఉంటున్నారు. గత నెల సెప్టెంబరు 29వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతను సోదరుడికి ఫోన్ చేసి దుబాయ్ వెళ్తున్నానని మూడు నెలల వరకు రానంటూ చెప్పాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మరుసటి రోజు అతడి సోదరుడు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. అయితే అతడు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల్లో తాడుతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పో టలీసులకు శనివారం ఉదయం సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సెల్ నెంబర్ లభించిన ఆధారాలతో మృతుడి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రారంభానికి ముందే విషాదం

- రేకుల షెడ్ కూలి తల్లీకుమారుడు మృతి
- ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు

చిట్యాలరూరల్, మాడ్గులపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు కొత్త వ్యాపారంలోకి ప్రవేశించి తమ జీవితాల్లో వెలుగు నింపు కోవాలనుకున్న ఓ కుటుంబంలో చీకట్లు నిండాయి. కాఫీ దుకా ణా న్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో రేకుల షెడ్డు కూలి అక్కడే నిద్రి స్తున్న తల్లీకుమారులు మృతిచెందగా, ఇద్దరికి గాయా లయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఈ విషాదం నెల కొంది. చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్, స్థా నికులు తెలి పిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన పగుళ్ల వెంకన్నకు నిడమనూరు మండలం వంగాలగూడెం గ్రామానికి చెందిన నాగమణి (32)తో తొమ్మిదేళ్ల క్రితం వివాహంకాగా, కుమారుడు విరాట్ కృష్ణ (7), కుమార్తె నందిని ఉన్నారు. వెంకన్న రైల్వే శాఖలో గ్యాంగ్‌మన్‌గా తిప్పర్తి మండలంలో పనిచేస్తున్నాడు. కు టుంబ అవసరాల నిమిత్తం ఆదాయాన్ని పెంచుకునేందుకు చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో స్థలాన్ని అద్దెకు తీసుకుని ఫిల్టర్ కాఫీ కేఫ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. దుకాణం వెనుక సిమెంటు రేకులతో ఓ షెడ్డును నిర్మించి, ఓ మూలన ఇనుప పట్టీలు ఏర్పాటుచేసి దానిపై ప్లాస్టిక్ నీటి ట్యాంకును ఏర్పాటు చేశాడు.

పండుగకు ముందురోజే ప్రారంభించాలని..

దీపావళి పండుగ సందర్భంగా ముందు రోజైన ఆదివా రమే కాఫీ కేఫ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లి పార్వతమ్మ, భార్య నాగ మణి (32), కుమార్తె నందిని, కుమారుడు విరాట్‌కృష్ణ(7)లను పెద్ద కాపర్తికి తీసుకువచ్చాడు. శనివారం రాత్రి భోజ నాల అనంతరం పనులు పూర్తి చేసుకుని కుటుంబ సభ్యులు అందరూ కేఫ్ వెనుక ఉన్న గదిలో నిద్రకు ఉపక్రమించారు. దుకాణం ప్రారంభో త్సవం ఉన్నందున వెంకన్న ఆదివారం తెల్ల వారుజామున భార్యాపిల్ల లను నిద్రలేపకుండా పూజా కార్యక్రమాలకు సన్నద్ధమయ్యాడు. ఈ క్రమంలో నీటిట్యాంకును నింపేందుకు బోరు వేశాడు. ట్యాంకులో నీరు పూర్తిస్థాయిలో నిండుతూ బరువు అధి కమై రేకులషెడ్డుపై పడిపోయింది. ట్యాంకు సిమెంట్ రేకులపై పడటంతో అవి పగిలిపోయి షెడ్డు కింద నిద్రి స్తున్న నాగమణి, విరాట్‌కృష్ణ, పార్వతమ్మ, నందినిలపై పడింది. ఒక్కసారిగా పెద్దశబ్దం రావడం, వెనుక గదిలో అరుపులు రావడంతో ముందు భాగంలో కేఫ్ వద్ద పనుల్లో ఉన్న వెంకన్న, ఇతరులు హుటాహుటిన అక్క డికి చేరుకున్నారు. గదిలో ఉన్న వారిపై రేకులు, నీటి ట్యాంకు పడి ఉండటాన్ని గమనించి పక్కకు తొలగిం చారు. నాగమణి, విరాట్‌కృష్ణ, పార్వతమ్మ, నందినిలకు తీవ్ర గాయాలుకాగా, నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో నాగమణి, విరాట్‌కృష్ణ మృతి చెందారని వైద్యులు నిర్ధారించగా, పార్వతమ్మ, నందినిలకు వైద్య చికిత్స అందిస్తున్నారు. పగుళ్ల వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పండుగకు ముందురోజే కాఫీ కేఫ్‌ను ప్రారంభించే సంతోషంలో ఉండగా భార్య, కుమారుడు మృతి చెందడం విషా దాన్ని నింపింది. బతుకుదెరువు కోసం వెళ్లొస్తామంటూ మాడ్గులపల్లిలో ఇరుగుపొరుగువారికి చెప్పి బయలుదే రిన నాగమణి తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో అక్కడి వారు కన్నీ రుమున్నీరై విలపించారు. నాగ మణి, విరాట్‌కృష్ణ మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీ సులు తెలిపారు.

మాడ్గులపల్లిలో తల్లీకుమారుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

విషాద సమయంలోనూ మానవత్వం

మాడ్గులపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): షెడ్డు కూలి మృతిచెందిన ఘటనలో తల్లీకుమారుల నేత్ర దానానికి కుటుంబసభ్యులు అంగీకరించి మానవత్వం చాటారు. నాగమణి, విరాట్‌కృష్ణల మృతదేహాలు పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డొనేషన్ సెంటర్ నిర్వాహకులు మృతుల కుటుంబ సభ్యులను సంప్రదించారు. భర్త వెంకన్న, కుటుంబసభ్యుల అంగీకారంతో నేత్రాల కార్నియాను టెక్నీషియన్ బచ్చలకూరి జాని సేకరించారు. విషాద సమయంలోనూ నేత్రాలను దానం చేసి మానవత్వం ప్రదర్శించారని స్థానికులు ప్రశంసించారు.

ఘనంగా విశ్వేశ్వర స్వామి కల్యాణం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి సందర్భంగా పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం శివాలయంలో ఆదివారం విశాలాక్షి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. అర్చకస్వాములు వేద మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించి సాయంత్రం కల్యాణం జరిపారు. భక్తులు హాజరై స్వామి కల్యాణాన్ని తిలకించి పరవశించిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో కుశలయ్య, శేఖర్‌పాల్గొన్నారు.

సమాజ వికాసంలో జర్నలిస్టులది కీలకపాత్ర

చిట్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజ వికాసంలో జర్నలిస్టులది కీలకపాత్ర అని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం చిట్యాలలోని పలువురు జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా సంజయ్‌దాస్‌గౌడ్ మాట్లాడుతూ సమస్యలను వెలికితీసి వాటిని పరిష్కరించడంలో జర్నలిస్టులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. జర్నలిస్టులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

పెన్షనర్ల బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండకల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు పీఆర్‌సీ అమలు చేస్తామన్న, పెన్షనర్లకు ఇస్తానన్న బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గజవెల్లి సత్యం, యాదవాసుదేవ్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన బెనిఫిట్స్ రాక ఇబ్బందులు పడి కొందరు ఇప్పటికే మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పీఆర్‌సీని ప్రకటించి, డీఏలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీపావళి కానుక ఒక డీఏ ఇస్తామని చెప్పి ఆ విషయంపై ఇప్పటి వరకు మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. తమ సత్తా ఏమిటో స్థానిక సంస్థల ఎన్నికల్లో చూపిస్తామన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ పోరాటానికి సిద్ధం కావాలని పిలునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రమేష్, హుస్సేన్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన జీపీ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్

కనగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) అర్హత కలిగిన పంచాయతీ వర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. కనగల్ మండలం కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పోతెపాక సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు జీపీ కార్మికులకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. మల్టీపర్పస్ విదానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలను అందజేయాలన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక చట్టాలను నీరుగార్చిందని దుయ్యబట్టారు. కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. సమావేశానికి ముందు ఆయన సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు కానుగు లింగస్వామి, ఏర్పుల యాదయ్య నాయకులు పోలె సత్యనారాయణ, వినోద్‌కుమార్, ముత్యాలు, అంజయ్య, సర్వయ్య, జహీర్, జానయ్య, రామలింగయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.


మహాసభ సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

మండల స్వామి మృతి తీరనిలోటు


నల్లగొండకల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) కవి, కథకుడు మండల స్వామి మృతి సాహిత్యరంగానికి తీరని లోటని పలువురు సాహితీవేత్తలు అన్నారు. పట్టణంలోని స్థానిక ఎంవీఎన్ విజ్ఞాన కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం స్వామి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యకమంలో సాహితీ వేత్తలు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, నాగేందర్, ఆనంద్, వెంకట్, సత్తయ్య, శంకర్ పాల్గొన్నారు.



ఎల్లమ్మ క్షేత్రానికి భక్తజన జాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తజన జాతర కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు నిర్వహించారు. చీరసారె ఒడిబియ్యం, బోన నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం గాదె దామోదర్‌రావు, మహేష్ రావు, ఫణి, శ్రీనివాస్, అవ్యయ్‌లు అమ్మవారికి విశేష అలంకరణలు జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.






కుమ్మరుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


సమావేశంలో పాల్గొన్న కుమ్మర సంఘం నాయకులు

నల్లగొండరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కుమ్మర సంఘం నూతన కమిటీలు సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు కుమ్మరుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా చేతరాజు వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని కుమ్మర సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సలికంటి రాములు అధ్యక్షతన నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా చేతరాజు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు నీలకంఠం లింగయ్య, ప్రధాన కార్యదర్శి తిరుమణి శేఖర్, కోశాధికారి తీగుళ్ల యెహోవదాస్, ఉపాధ్యక్షులు చిలుకూరి బిక్షం, రాయరపు గోపి, కోయడ సత్యనారాయణ, దొమ్మాటి యాదగిరి, మలికంటి అంజయ్య సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం యూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ఆమటి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి దోర్నాల శివ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సిలివేరు అనిల్ కుమార్, ప్రధానకార్యదర్శి సిరసవాడ సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు ఉప్పునూతల సుగుణమ్మ, కార్యదర్శి చిట్టిమళ్ల కౌసల్య, లీగల్ అడ్వైజర్‌గా రాచకొండ వెంకన్న సభ్యులను ఎన్నుకున్నారు.



వైభవంగా పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం

నార్కట్‌పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకుని నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి గుట్టపై ఉన్న శివాలయంలో ఆదివారం పార్వతీ రామలింగేశ్వరుల మాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఉత్సవంలో ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు, ఆలయ ఈవో చిట్టిడి వెం కట్‌రెడ్డి, సిబ్బంది తదితర భక్తులు పాల్గొన్నారు.


గోపలాయపల్లి గుట్టపై మాస కల్యాణం చేస్తున్న అర్చక స్వాములు

నేడు, రేపు కేదారేశ్వర వ్రతం చేసుకోవచ్చు

అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు

రామగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా కేదారేశ్వర వ్రతం చేసుకునేవారు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం సాయంత్రం వరకు అమవాస్య ఘడియలు చేసుకోవచ్చని అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు కేదారేశ్వర వ్రతాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సోమవారం నరక చతుర్దశి నివాళులు, ధనలక్ష్మి పూజ చేసుకోవచ్చన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కట్టంగూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన రావర్తి నాగలక్ష్మి ఇటీవల అయిటిపాముల గ్రామంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్ర గాయాలైంది. చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించడంతో ఇప్పటికే రూ.15లక్షలు ఖర్చు అయ్యాయి. కట్టంగూరుకు చెందిన రేణుక ఎల్లమ్మ జమదగ్ని సమేత చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బాధితురాలికి తమ వంతు సాయంగా రూ.1,04,000లను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బుడిగ అనూష, సభ్యులు పాల్గొన్నారు.











ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	54,305	54,305
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.55 (4.34)	1,912.14	1,448.88
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.948 (44.1326)	35,723	29,723

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

నేడు దీపావళి

» లక్ష్మీ పూజ, రేపు నోములు
» అంతటా పండుగ సందడి



నల్లగొండ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెలుగు పూల పండుగ దీపావళి సందడి నెలకొన్నది. సోమవారం లక్ష్మీపూజ, మంగళవారం కేదారీశ్వరి నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. పలువురు ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలు, దుకాణాలను విద్యుత్ దీపాలు, బంతి పూలతో అలంకరించారు. రహదారుల వెంట బంతిపూలు, మట్టి ప్రమిదలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. పలు ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. పలువురు పట్టణాల నుంచి సొంత ఊర్లకు వెళ్తుండడంతో రహదారులపై ట్రాఫిక్ పెరిగింది. బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. జిల్లా అంతటా దీపావళి సందడి నెలకొంది. జిల్లా కేంద్రం భువనగిరిలోని రైతుబజార్, వినాయక చౌరస్తా, కుండల బజార్, తదితర ప్రాంతాల్లో బంతిపూలు, పూజాసామగ్రి విక్రయాల సందడి నెలకొంది. అలాగే జిల్లా అంతటా సదర్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

గడువు పెంచిన ప్రభుత్వం

27న లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

నల్లగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈనెల 23 వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 7వేలకు పైగా దరఖాస్తులు రాగా, ఈసారి 4,620 దరఖాస్తులు వచ్చాయి. దీంతో గడువును పెంచి దరఖాస్తుల సంఖ్య పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఈనెల 20న దీపావళి పండుగ సెలవు ఉండటంతో 21, 22, 23 తేదీల్లో దరఖాస్తులు తీసుకోనున్నారు. 23న లాటరీ ప్రక్రియ నిర్వహిస్తారు.

త్యాగధనుల స్మృతిలో..

నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

6



వడ్డెరులకు నామినేటెడ్ పద్ధతిలో
టెండర్లు కేటాయించాలి

దేవరకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వడ్డెరులకు రూ.20లక్షల వరకు టెండర్ పనులలో నామినేటెడ్ పద్ధతి ప్రకారం కేటాయించాలని వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కూడా వడ్డెరులకు రూ.50లక్షల వరకు ప్రభుత్వ టెండర్లలో ఈఎండీ లేకుండా జీవో జారీ చేయాలని కోరారు. వడ్డెర కులస్థులు లైసెన్స్ ఉన్నా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిన వడ్డెరులకు టెండర్ పనులు కేటాయించాలని కోరారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దామరచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూసీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

జీఎస్టీ కుదింపుతో మరింత వెలుగులు

మిర్యాలగూడ టౌన్: జీఎస్టీ కుదింపుతో దీపావళి మరింత ప్రత్యేకంగా మారిందని బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.





